దరఖాస్తులు సక్రమంగా ఆన్‌లైన్ చేయాలి

పలిమెల : డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి విజయ్‌భాస్కర్

పలిమెల/ టేకుమట్ల/మహదేవపూర్/కాటారం, జనవరి 9 : ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతున్నది. మంగళవారం జిల్లాలోని వివిధ మండలాల్లో అధికారులు ఆపరేటర్లు చేస్తున్న ఎంట్రీలను పరిశీలించారు. పలిమెలలో మండల ప్రత్యేకాధికారి విజయభాస్కర్ మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రకాశ్‌రెడ్డి , ఏపీవో సునీత, పంచాయతీ కార్యదర్శులు మదన్, శ్రీధర్, సల్మాన్ పాల్గొన్నారు. టేకుమట్ల మండలంలోని దరఖాస్తులను 37 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్ చేస్తున్నారు. మండల స్పెషలాఫీసర్ శైలజ మంగళవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. మహదేవపూర్ మండల పరిషత్ , తహసీల్దార్ కార్యాలయాల్లో డాటా ఎంట్రీని ఎంపీడీవో రవీంద్రనాథ్ పరిశీలించారు. ఇప్పటి వరకు సుమారు 70 శాతం ఎంట్రీ పూర్తయినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రసాద్, కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, సమ్మయ్య, రాజు, అంజలిరెడ్డి, సృజన్ పాల్గొన్నారు. కాటారం మండలం కొత్తపల్లి, అంకుషాపూర్ సీఎస్‌సీ సెంటర్లతోపాటు కాటారం సీఎస్‌సీ, ఎంఈవో కార్యాలయంలోని సెంటర్‌ను ఎంపీడీవో శంకర్ నాయక్, ఎంపీవో ఉపేంద్రయ్య తనిఖీ చేశారు. 17లోగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

భక్తుల మనోభావాలను గౌరవించాలి

- 31లోగా పనులు పూర్తి చేయాలి
- ఉచిత బస్సు సౌకర్యానికి ఏర్పాట్లు చేయాలి
- మేడారం మహా జాతర సమీక్షలో మంత్రులు

మేడారం జాతర సమీక్షా సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు, సీఎస్

ములుగు, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : మేడారం మహా జాతరకు హాజరయ్యే భక్తుల మనోభావాలను గౌరవిస్తూ అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ధనసరి అనసూయ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆధ్వర్యంలో మేడారం మహా జాతరపై ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ములుగు జిల్లా నుంచి కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఎస్పీ డాక్టర్ శబరీశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ జాతర ఏర్పాట్ల కోసం ప్రభుత్వం రూ.75కోట్లు మంజూరు చేసిందని, ఈ నెల 31లోగా పనులు పూర్తి చేయాలన్నారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకొని వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు సౌకర్యం వల్ల మహిళలు అధిక సంఖ్యలో బస్సుల్లో ప్రయాణించే అవకాశం ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. డీజీపీ రవిగుప్తా, ఆదిలాబాద్ ఎస్పీ గౌష్‌ఆలం, డీఎస్పీ రవీందర్, ఇతర ఉన్నత స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు స్థాన చలనం

ఉత్వర్వులు జారీ చేసిన ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో పనిచేస్తున్న పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు వెలువరించారు. గోవిందరావుపేట తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను ములుగు ఆర్డీవో కార్యాలయానికి డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న డీ సమ్మయ్యను కలెక్టరేట్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా నియమించారు. ఏటూరునాగారంలో తహసీల్దార్ ఎన్ సృజన్‌కుమార్‌ను గోవిందరావుపేట తహసీల్దార్‌గా నియమించారు. కన్నాయిగూడెం నయాబ్ తహసీల్దార్ ఎండీ సర్వర్‌ను ఏటూరునాగారం తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎండీ ఖాజామొయినుద్దీన్ వెంకటాపురం (నూగూరు) మండల తహసీల్దార్‌గా నియమించారు. ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్న ఎస్ సమ్మయ్యను కలెక్టరేట్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా నియమించారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో పాణిని

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు రాబట్టాలి

ములుగురూరల్/వెంకటాపూర్, జనవరి 9 : విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో జీ పాణిని అన్నారు. మంగళవారం ఆయన ములుగు మండలం కాసింపేవిపేట, జంగాలపల్లి, వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ ఆదర్శ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించాలన్నారు. అలాగే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ పాఠ్యాంశాలను రివిజన్ చేయాలన్నారు. ప్రతి రోజు సాయంత్రం స్లిప్ టెస్ట్ నిర్వహించి విద్యార్థుల పఠనాక్తిని పెం పొందించాలని తెలిపారు. ప్రత్యేక తరగతుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బద్దం సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

నాగారం పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీజ

మెనూ అమలు చేయాలి

- ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ
- పాఠశాలలు, కార్యాలయాల తనిఖీ

వాజేడు, జనవరి 9 : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు సక్రమంగా భోజనం అందించాలని ఎస్‌వో సూజాతకు సూచించారు. రిజిస్టర్లు పరిశీలించి, విద్యార్థులను మెనూ అమలుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. నాగారం ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించి విద్యా బోధనను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఆమెవెంట తహసీల్దార్ శ్రీనివాస్, వైద్యాధికారి మధుకర్, హెచ్ఎం ఇర్ప బాలాజీ ఉన్నారు.

కేజీబీవీ ఏఎన్ఎంకు షోకాజ్

మండల కేంద్రంలోని కేజీబీవీలో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్ఎం కుసుమకు డీఈవో షోకాజ్ నోటీసు జారీ చేశారు. మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీజ పాఠశాలను తనిఖీ చేసిన సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాలను ఏఎన్ఎం పాటించడం లేదని గుర్తించారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో నోటీసు జారీ చేశారు. అలాగే ఇదే పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు తన వ్యక్తిగత కారణాలవల్ల విధులు నిర్వర్తించలేనని సమర్పించిన రాజీనామా పత్రాన్ని కూడా ఆమోదించినట్లు డీఈవో తెలిపారు.

11 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

మొగుళ్లపల్లి, జనవరి 9 : మండల కేంద్రంలో ఈ నెల 11 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు స్నేహ యూత్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కుమారస్వామి, శ్రీధర్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ జట్టు పేరును రూ. 500 చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. ప్రథమ బహుమతి రూ.10,016, ద్వితీయ బహుమతి రూ. 5,016 అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 9398 436751, 9160657369 నంబర్లను సంప్రదించాలన్నారు.

తహసీల్ ఎదుట మహిళల ధర్నా

- తమ భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారంటూ ఆరోపణ

మందు డబ్బాతో బైఠాయించిన మహిళలు

కాటారం, జనవరి 9 : కాటారం తహసీల్ ఎదుట కొత్తపల్లి గ్రామానికి చెందిన తోటపల్లి శ్యామలతో పాటు ఆమె కుమార్తెలు పూజ, తేజారాణి మంగళవారం ధర్నాకు దిగారు. వారి కథనం ప్రకారం.. కాటారం రెవెన్యూ శివారు సర్వే నంబర్ 202/ఏలో తోటపల్లి వెంకట్‌రెడ్డికి 4.3 ఎకరా భూమి ఉందన్నారు. అయితే తమ భూమిని 2022 డిసెంబర్‌లో అప్పటి తహసీల్దార్ శ్రీనివాసరావు వేరే వారికి పట్టా చేయడంతో కోర్టులో పిటిషన్ వేశామన్నారు. సదరు భూమిని తమకు తెలియకుండా ప్రస్తుత తహసీల్దార్ నాగరాజు మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారంటూ ఆరోపిస్తూ మంగళవారం పురుగుల మందు డబ్బాతో ఆందోళన దిగారు. గతంలో తమ భూమిని పట్టా మార్పిడి చేసుకున్నవారు వేరొకరికి పట్టా మార్పు చేయాలని స్లాట్ బుక్ చేసుకున్నారని సమాచారం తెలియగానే పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టామని, హైకోర్టులోనూ రిట్ పిటిషన్ వేశామన్నారు. అయినప్పటికీ ఈ నెల 9న తహసీల్దార్ పట్టా మార్పుడి చేశారని ఆరోపిస్తూ తల్లీ కూతుళ్లు తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. దీంతో తహసీల్దార్ నాగరాజు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పీఎస్సై ప్రసాద్ సిబ్బందితో అక్కడికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. వారి వద్ద ఉన్న మందు డబ్బా తీసుకున్నారు. కలెక్టర్‌ను కలిసి విన్నవించడమో, కోర్టుకెళ్లి ఉత్తర్వులు తెచ్చుకోవడమో చేయాలంటూ చెప్పడంతో వారు ధర్నా విరమించారు. ఈ విషయమై తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ పట్టా ఉన్న వారు స్లాట్ బుక్ చేసుకుంటే రిజిస్ట్రేషన్ చేయాల్సిందేనని, రెండున్నర నెలలుగా పెండింగ్‌లో పెడుతున్నారంటూ పట్టాదారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే ఆయన సూచనల మేరకు రిజిస్ట్రేషన్ చేశామన్నారు. ఆ భూమిపై కోర్టు ద్వారా స్టేటస్ కో, ఇంజక్షన్ ఆర్డర్‌గాని ఏమీ లేదని, రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నవారికి ధరణి రూల్స్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాల్సిందేన అన్నారు. తాను ఈ భూమి విషయంలో ఏ పొరపాటు చేయలేదని తెలిపారు.

మహిళలకు మెరుగైన వైద్యం

మహిళకు పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

కృష్ణకాలనీ, జనవరి 9 : ఆరోగ్య మహిళ కేంద్రంలో మహిళలకు మెరుగైన వైద్యసేవలందిస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అన్వేషిణి తెలిపారు. కారల్ మార్క్స్ కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆరోగ్య మహిళ కేంద్రంలో మంగళవారం వైద్య సేవలందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మహిళలకు రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

ఈ సందర్భంగా అన్వేషిణి మాట్లాడుతూ ఆరోగ్య మహిళ కేంద్రం ద్వారా ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేకంగా 8 విభాగాల్లో 57 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. మెరుగైన వైద్య సేవలు అవసరమైన వారిని జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలిస్తున్నామని, అక్కడ తగ్గకుంటే ప్రభుత్వమే రవాణా ఖర్చులు భరించి హైదరాబాద్‌లోని ప్రధాన వైద్యశాలలకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ మంగళవారం 40 మందికి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. భూపాలపల్లి పీహెచ్‌సీ డాక్టర్ రోహిణి, ల్యాబ్ అసిస్టెంట్ రాజు, ఏఎన్ఎంలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

పీహెచ్‌సీని తనిఖీ చేసిన ములుగు డీఎంహెచ్‌వో

మంగపేట, జనవరి 9 : మంగపేట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య తనిఖీ చేశారు. దవాఖానలో మందుల నిల్వలు, ల్యాబ్ నిర్వహణ తదితర విషయాలను పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆశ వర్కర్లు తమ సబ్ సెంటర్ పరిధిలో ఇంటింటిని సందర్శించి జ్వరాలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి పీహెచ్‌సీకి పంపించాలని సూచించారు. సమయపాలన పాటించని వారిపై శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, వైద్యులు నిఖిల్, స్వప్నిత, వైశాలి, సిరాజ్, సూపర్‌వైజర్లు గంగమ్మ, రాంబాయి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు

'గిరిజన' సంఘానికి మొండిచెయ్యి

- మేడారం పనులు కేటాయించని అధికారులు
- సంఘం సభ్యుల్లో తీవ్ర అసంతృప్తి

తాడ్వాయి, జనవరి 9 : మేడారం మహాజాతర విజయవంతంలో ముఖ్య భూమిక పోషించే గిరిజన అభ్యుదయ యువజన సంఘానికి అభివృద్ధి పనుల్లో పలు శాఖల అధికారులు మొండిచెయ్యి చూపించారు. సమ్మక్కను గుట్ట పైనుంచి గద్దెలపైకి వచ్చే ప్రధాన ఘట్టంలో ఈ సంఘం సభ్యులే ప్రధానం. ప్రతి జాతరలో కలెక్టర్లు ఈ సంఘానికి నామినేటెడ్ పద్ధతిన కొన్ని పనులు కేటాయించేవారు. తద్వారా సమకూరిన ఆదాయంతో గిరిజన సంఘం ఆధ్వర్యంలో మేడారంలో ఏర్పాటుచేసిన లైబ్రరీ గదిలో యువత కోసం కంప్యూటర్లు, పోటీ పరీక్షల మెటీరియల్‌ను అందుబాటులో ఉంచేవారు. కానీ, ఈ జాతరలో సంఘానికి ఎలాంటి పనులు కేటాయించకపోవడంతో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తల్లులను తీసుకువచ్చే క్రమంలో పోలీసులు కూడా వీరి సేవలను వినియోగించుకునేవారు.

మా సేవలను గుర్తించడం లేదు

- సిద్దబోయిన భోజారావు, గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు

మహాజాతరతో పాటు ఏటా జరిగే మినీ జాతరలో మా సంఘ సభ్యులందరం సేవలందిస్తాం. ప్రతిసారి అధికారులు పనులు కేటాయించి సంఘం అభివృద్ధి సహకరించారు. కానీ ఈసారి జరిగే జాతరలో మా సంఘానికి పనులు కూడా కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. జాతరలో ముఖ్య భూమిక పోషించే సంఘాన్ని గుర్తించకపోతే మేము కూడా తల్లుల రాక సందర్భంగా సహకరించం. అధికారులు స్పందించి మా సంఘం అభివృద్ధికి తోడ్పడాలి.

అపరిచితులకు ఆశ్రయం కల్పించొద్దు

గోవిందరావుపేట, జనవరి 9 : గొత్తికోయలు అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని ఎస్సై షేక్ మస్తాన్ అన్నారు. మంగళవారం ఆయన పస్రా పరిధిలోని మచ్చాపూర్ గొత్తికోయ గంపును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త వ్యక్తులు తారస పడితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే దుప్పట్లును పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

బీజేపీ మతోన్మాద విధానాలను ఎండగట్టాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాస్కర్

ప్లీనరీలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

కృష్ణకాలనీ, జనవరి 9 : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అవలంభిస్తున్న మతోన్మాద విధానాలను ప్రజలకు తెలియజేస్తూ ఎక్కడికక్కడ ఎండగట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ అన్నారు. ముంగళవారం జిల్లా కేంద్రంలోని వంగాల రామస్వామి నగర్‌లోని శ్రామిక భవనంలో జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షతన జరిగిన పార్టీ ప్లీనరికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'వర్తమాన రాజకీయాలు, మన కర్తవ్యాలు' అనే అంశంపై మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వారి మాతృసంస్థ అయిన ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తూ, మత రాజకీయాలతో మరోసారి దేశంలో అధికారంలోకి రావడానికి కుట్రపన్నుతుందన్నారు. పాలకుల ఆర్థిక విధానం వల్ల భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ప్రపంచంలోనే 5వ స్థానానికి పడిపోయిందన్నారు. పెట్టుబడిదారులు, బడా భూస్వాములకు బీజేపీ కొమ్ముకాస్తున్నదని, ముమ్మాటికి కార్మికులు, కర్షకుల వ్యతిరేక పార్టీ అన్నారు. కేంద్ర ప్రభుత్వ చట్టాలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, రైతులను కూలీలుగా చేసే చట్టాలకు వ్యతిరేకంగా పోడాలన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు వెయ్యాలని కేంద్ర ప్రభుత్వంపై నిరుద్యోగులు ఒత్తిడి తీసుకురావాలన్నారు. సమావేశంలో నాయకులు పొలం రాజేందర్, వెంకటేశ్, రమ, రాజయ్య, శ్రీకాంత్, దేవేందర్, రజినీకాంత్ పాల్గొన్నారు.

నల్లకాలువ పూడికతీత పనులు ప్రారంభం

గణపురం, జనవరి 9 : మండలంలోని చెల్పూర్ గ్రామ పంచాయతీ మల్హార్ మాటు ఆయకట్టు పరిధి నల్లకాలువ పూడికతీత పనులను మంగళవారం ఎంపీపీ కావటి రజితా రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూడికతీత పూర్తయితే 1000 ఎకరాలకు సమృద్ధిగా నీరందుతుందని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో రైతులు సంపత్‌రావు, తిరుపతి, ప్రభాకర్, శ్రీనివాస్, రాజిరెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరన్న జయంతిని విజయవంతం చేయాలి

మంగపేట, జనవరి 9 : సూర్యపేటలో ఈ నెల 31న నిర్వహించనున్న దళిత బహుజన శ్రామిక విముక్తి వ్యవస్థాపకుడు మారోజు వీరన్న జయంతి వేడుకలను విజయవంతం చేయాలని సీపీయూఎస్ఐ ములుగు, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల కార్యదర్శి వావిలాల లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మండలంలోని కమలాపురం అంబేద్కర్ సెంటర్‌లో జయంతి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను జిల్లా నాయకుడు దాసరి ముత్తన్న అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన కూలి రైతు సంఘం కార్యదర్శి పిట్టల రాజమౌళి, చందు, మాణిక్యం, మల్లన్న పాల్గొన్నారు.

ప్రియుడితో మహిళ పరారీ

రేగొండ, జనవరి 9 : మండలంలోని గూడెపల్లికి చెందిన మహిళ ప్రియుడితో పారిపోయినట్లు చిట్యాల సీఐ వేణు చందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గూడపల్లికి చెందిన లింగంపెల్లి శ్రీధర్ తన భార్య ఇద్దరు పిల్లలను బోనాల పండుగకు అత్తగారి ఊరైన చిట్యాల మండలం బావుసింగ్‌పల్లెకు ఆదివారం పంపించాడు. ఇదే అదునుగా భావించిన గూడెపల్లికి చెందిన బైకాని రాజేందర్ అక్కడికి వెళ్లి శ్రీధర్ భార్యను తీసుకొని పరారయ్యాడు. విషయం తెలుసుకున్న శ్రీధర్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, మంగళవారం ఉదయం నిందితుడు రాజేందర్ ఇంటి ఆవరణంలో ఉన్న టాటా మ్యాజిక్ వాహనం దగ్గమై ఉంది. కాగా, శ్రీధరే ఆటో దగ్ధం చేశాడంటూ రాజేందర్ తండ్రి మల్లయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇద్దరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కల్తీ మద్యంను అరికట్టాలి

కాళేశ్వరం జనవరి 9 : కాళేశ్వరంలోని రెండు వైన్ షాపుల్లో మద్యాన్ని కల్తీ చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నారని, దానిని అరికట్టాలని ఎంపీటీసీ మమత మంగళవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వైన్ షాపుల్లో నిబంధనలు పాటించడంలేదని, బెల్టు షాపులకు సైతం కల్తీ మద్యాన్ని సరఫరా చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మహాముత్తారం, జనవరి 9 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి సందీప్ సూచించారు. మంగళవారం మండలంలోని కనుకునూర్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 46 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎపిడమిక్ సబ్ యూనిట్ ఆఫీసర్ టీ రమేశ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్లు పరమేశ్వర్, రవీందర్, ఏఎన్ఎంలు సూర్యకళ, భూలక్ష్మి, ఆశ వర్కర్లు మమత, సంతోష, మీన తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి హాకీ టోర్నమెంట్

భూపాలపల్లి రూరల్, జనవరి 9 : ఈ నెల 18 నుంచి 21 వరకు కోలిండియా స్థాయి హాకీ టోర్నమెంట్‌ను భూపాలపల్లిలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు సింగరేణి ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 9 జట్లు తలపడనున్న ఈ పోటీలను సింగరేణి సీఎండీ బలరాం ప్రారంభిస్తారని, కలెక్టర్ భవేశ్ మిశ్రా, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎస్పీ కిరణ్ ఖరే, సింగరేణి అధికారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

కాళేశ్వరం జడ్పీ పాఠశాలలో స్నాక్స్ వితరణ

కాళేశ్వరం, జనవరి 9 : కాళేశ్వరం జడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎంసీ మాజీ వైస్ చైర్మన్ బందెల రాజేశ్వరి పేరు మీద వారి కుమారులు పవన్, బన్నీ మంగళవారం ఉదయం, సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ మమత, ఉపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేశారు. మాజీ చైర్మన్ గందెసిరి సత్యనారాయణ, నాయకుడు నాగరాజు ఉన్నారు.

పనులను పరిశీలిస్తున్న స్థానిక నాయకులు, రైతులు

విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి

ములుగురూరల్, జనవరి 9 : విద్యార్థులు విద్య ద్వారా మంచి పౌరులుగా ఎదగాలని జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ వసుధ అన్నారు. వరంగల్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 'మై భారత్-వికసిత్ భారత్' అనే అంశంపై మంగళవారం జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ కళాశాలలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. జాకారం జూనియర్ కళాశాల విద్యార్థి మారుతి మొదటి, ములుగు జూనియర్ కళాశాల విద్యార్థిని శ్రావణి ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు జిల్లా యువజన అధికారి అన్వేష్ తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

రోగనిర్ధారణ సేవల రూపకల్పనకు 12న అధికారుల బృందం రాక

ఏటూరునాగారం, జనవరి 9 : గిరిజన ప్రాంతాల్లో రోగనిర్ధారణ సేవలను బలోపేతం చేయడంలో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన తెలంగాణ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సర్కారు సంకల్పించింది. ఏటూరునాగారంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో డయాగ్నోస్టిక్స్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం భవన నిర్మాణం చేపట్టింది. అందులో ల్యాబ్ ఏర్పాటు చేసిన సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలు సివిల్, ఎల్లక్ట్రికల్, నీటి, ఇంటర్‌నెట్ లాంటి సదుపాయాలు కల్పించేందుకు ఈనెల 12న తెలంగాణ డయాగ్నోస్టిక్స్ పీవో, డీసీహెచ్ఎస్ డీఎంహెచ్‌వో, టీఎస్ఎంఎస్ఐడీసీ డీఈలతో పాటు, పలు విభాగాల అధికారులు సందర్శించనున్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

చిట్యాల, జనవరి 9 : ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలు పడి రేకుల ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని నైన్‌పాకలో చోటుచేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఈర్ల మల్లక్క సోమవారం రాత్రి వంట చేసుకున్న అనంతరం కట్టెల పొయ్యిని పూర్తి స్థాయిలో ఆర్పలేదు. దీంతో నిప్పు రవ్వలు ఇంటిపై పడడంతో అది అంటుకుని వస్తువులు కాలిపోయాయి. ప్రమాదంలో రూ.40 వేల నగదు, రూ. 62 వేల విలువైన బంగారంతో పాటు రూ.1.20 లక్షల సామగ్రి దగ్ధమైనట్లు అంచనా వేశామని ఆర్ఐ రాజు చెప్పారు. తక్షణసాయం కింద బాధితురాలికి 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తొట్ల లక్ష్మి ఐలయ్య, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్‌లోడుతో వెళ్తున్న నాలుగు లారీలు సీజ్

మంగపేట, జనవరి 9 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి మంగపేట మీదుగా హనుమకొండ వైపు ఓవర్‌లోడుతో వెళ్తున్న నాలుగు ఇసుక లారీలను మంగళవారం రాత్రి పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఓవర్‌లోడు ఇసుకతో వెళ్తున్న లారీలతో రోడ్లు దెబ్బతింటున్నాయని, వాటిని నియంత్రించాలని ఈనెల 8న మంత్రి సీతక్క ఆదేశించిన నేపథ్యంలో తనిఖీలను ముమ్మరం చేసి లారీలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అధిక లోడుతో ఇసుకను తరలించొద్దని ఎస్సై హెచ్చరించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

భూపాలపల్లి రూరల్/